కాలమ్‌ు దాటని కథ

ఊరేగింపు

అది భారతదేశంలో ఒక ప్రముఖ రాష్ట్రానికి రాజధానీ నగరం. ఆ నగరంలోని రాజవీథిలో అటూ ఇటూ ట్రాఫిక్ ఎప్పుడూ ప్రవహిస్తూ వుంటుంది. సిటీ బస్‌లు, ఆటో రిక్షాలు, స్కూటర్లు, కార్లు, సైకిళ్లు, సైకిల్ రిక్షాలు... నగరంలో ఏ మూలకి వెళ్ళడానికయినా ఆ రాజవీథిలోంచే వెళ్ళాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల ఆఫీసులు, షాప్‌లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు అన్నీ ఎన్నో ఆ రాజవీథిలోనే వున్నాయి.

అయితే కొద్ది నెలలుగా ఆ రాజవీథికి ఎన్నడూ లేనంత ప్రాముఖ్యం వచ్చేసింది. అధికార పార్టీ, ప్రతి పక్షాలు, కార్మిక సంఘాలు, నిరుద్యోగుల సంఘం, సతీ ప్రతిఘటన సమాజం- అన్నీ ఆ రాజవీథిలోంచే ఊరేగింపులు తీసుకువెళ్ళడం ప్రారంభించాయి. అదీ సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో! ఆ ఊరేగింపులు అవరోధం లేకుండా సాగడానికి ఊరేగింపు జరిగే రోజున రాజవీథిలో సాయంత్రం నాలుగు నుంచి ఏడు



గంటల దాకా ట్రాఫిక్‌ని రద్దు చేయడం మామూలు అయిపోయింది. వారానికి కనీసం రెండు రోజులు ఊరేగింపులు వుండడంతో రాజవీథిలోని కార్యాలయాలలో ఉద్యోగాలు చేసేవారికి పెద్ద ఇబ్బంది ఏర్పడింది. సాయంత్రం యింటికి చేరుకోవడమే సమస్య అయిపోయింది.

పత్రికలకు రాజవీథిలో ఊరేగింపులు నిషేధించాలనీ, అవసరమయితే సెలవు రోజులలోనే పెట్టుకోవాలని సంపాదక లేఖలు రాశారు. ముఖ్యమంత్రికి, గవర్నర్‌కి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తులు పంపుకున్నారు. సచివాలయం దగ్గర ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు నిరసన వ్రతం చేశారు. అయినా రాజవీథిలో ఊరేగింపులు ఆగలేదు. ఎవరూ ఆపలేదు.

ఒక సుముహూర్తంలో 'రాజవీథి బాధితుల' సంఘం స్థాపించారు. ఏం చేయాలో నిర్ణయించారు. ఒక చల్లని చక్కని సాయంత్రం 'రాజవీథిలో ఊరేగింపులు నిషేధించాలి' అంటూ నినాదాలతో పెద్ద ఊరేగింపు జరిపారు- రాజవీథిలో!

- తాజీ ప్రసాద్

ఒకతను సతీసమేతంగా సినిమా చూసి సాయంత్రం ఏడింటికి బేగంపేటలో వాళ్లింటికి వెడుతున్నాడు. సడన్‌గా ముందరో ఆర్టీసీ బస్సు వచ్చి ఆగింది. ఇతడు బ్రేక్ వేసి స్కూటర్ పక్కకు తీసుకునే లోపునే వెనుకనుండి మరో బస్సు వచ్చి కొట్టేసింది. ఎంత పుణ్యం చేసుకున్నారో, ఏ బాధా లేకుండా దంపతులిద్దరూ అక్కడికక్కడే ప్రాణా లొదిలారు. తరువాత డ్రైవర్ని అరెస్టు చేశారట. కాని ఏం లాభం. పోయిన ప్రాణాలు రావు కదా!

మూడు వందలమంది పనిచేసే మా చిన్న ఆఫీసు కుటుంబానికి ఈ షాక్స్ సరిపోవన్నట్టుగా, మొన్నటికి మొన్న రాజయ్య అనే మా ప్యూను వుదయం ఆఫీసుకు వస్తూ, ఆఫీసు ముందరే బస్సు దిగి రోడ్డు క్రాస్ చేస్తూ అనేక మంది కొలీగ్స్ చూస్తూనే వున్నారు- కారు కింద పడ్డాడు. కాళ్లు విరిగాయి. తలకాయ చిట్లింది. అందరూ కలిసి హడావిడిగా ఉస్మానియాకు తీసికెళ్ళారు. కాని లాభం లేకపోయింది. సాయంత్రం నాల్గింటికి రాజయ్య కూడా మా నుండి శాశ్వతంగా వెళ్లిపోయాడు.

"గురూ, జీవితం మూన్నాళ్ల ముచ్చట. బుద్బుద ప్రాయం!" అన్నాడు శర్మ.

"పునర్జన్మ అంటే ఈ చొక్కా విడిచి మరో చొక్కా తొడుక్కోవటమే. ఆత్మకు మరణం లేదు." అన్నాడు రామారావు. అన్నీ నిజమే కాబోలు. ఇలాంటి సమయంలో హేతువాదం పనిచెయ్యదు. నిండు ప్రాణాలు క్షణంలో మనకు కాకుండా పోయినప్పుడు కలలు, ఆశలు, భార్యాపిల్లల భవిష్యత్తు అన్నీ కన్నుమూసి తెరిచినంతలో మంటలపాలై పిడికెడు బూడిదగా మిగిలినప్పుడు జీవితం క్షణ భంగురమని కాక మరేమి అనుకోగలం!

స్కూటరెక్కాలన్నా, రోడ్డు క్రాస్ చెయ్యాలన్నా భయంగా వుంది. కాని మన చేతిలో ఏముందీ. ఎలా రాసుంటే అలా జరుగుతుంది.

మా మిత్రబృందం అందర్లోకీ జీవన్‌రావు చిన్నవాడు. పాతికేళ్ళు. పెళ్లై రెండేళ్ళయింది. డ్రెస్సులోనే కాక ఆలోచనల్లో కూడా ఆధునికుడు. కాలేజీ జీవితంలోనే చలాన్నీ, శ్రీశ్రీని వడపోసి వచ్చాడు. నాస్తికత్వం, హేతువాదం, మార్క్సిజం అంటూ మాకు పిలకల్లేకపోయినా మమ్మల్నందర్నీ పిలకరాయుళ్లుగానే చూస్తాడు. 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని మేం సరదాగా అంటే, అతడు 'మంచి గతమున కొంచెమేనోయ్' అంటూ గురజాడ చేత జవాబు చెప్పిస్తాడు. ఏదన్నా విషయం వాదిస్తున్నప్పుడు మాత్రం అతణ్ణి పట్టుకోవడం కష్టమైపోతుంది. తెగ ఆవేశపడిపోయి, స్నేహాన్ని కూడా తాత్కాలికంగా మరిచి, మమ్మల్ని 'ఛాందస పక్షం'ని, 'ప్రగతి నిరోధకులం'ని అంటాడు. అతని మాటల ధోరణి వింటే నవ్వాగదు.

"ఆహా, మీరు సాధిస్తున్న ప్రగతికి మేం అడ్డుపడుతున్నామంటారు?" అంటాడు దీక్షితులు.

"అవునోయ్, మీ వాళ్లంతా రెస్ట్ రెజ్ రెడ్ అంటూ పాట పాడుతున్నారుగా. తూర్పుకి తిరిగి దండం పెట్టు మరి" అంటూ వాత పెడతాడు శాస్త్రి.

మా పరిచయంలో, జీవన్‌రావు వల్ల మేం లెఫ్ట్‌కు తిరిగామో, మా వల్ల అతడు రైటుకు తిరగాడో తెలియదు గాని, అతడు యిటీవల మా మీద లావా కుప్పించటం తగ్గించాడు. అంతేకాదు. తెగ బాధపడి పోతున్నాడు.

'మా ఆవిడ సనాతన సంప్రదాయం నుండి వచ్చింది. ప్రతి రోజూ మడీ- ఆచారం అంటూ నా ప్రాణం తీస్తున్నది' అని చెప్పాడు. ఇతడిలాగే ఆ అమ్మాయి కూడా ఎమ్మే. లెక్చరర్‌గా వుద్యోగం చేస్తున్నది. ఆమెకు తన స్వంత నమ్మకాలూ, అభిప్రాయాలూ వున్నాయి. ఈ అయ్యగారి పప్పులు అమ్మగారి దగ్గిర వుడకడం లేదు. బహుశా, మేం గొంతు చించుకుని, ఉద్రేకపడి, వాదించి చెయ్యలేని పని ఆ అమ్మాయి కనుసన్నలలో కడకొంగుతో చెయ్యగలిగి వుంటుంది. అలాగ, నిశ్శబ్దంగా మగవాళ్లను మార్చగలిగే శక్తి ఆడవాళ్ల మొనాపలీ.

"వాదించి లాభం లేదు జీవన్. ఆమె నమ్మకాలు గౌరవించటమే నువ్వు చెయ్యగలిగిన, ఆచరణీయమైన, అభిలషణీయమైన పని" అన్నాను సానుభూతిగా.

"అలాగే కనిపిస్తోంది" అన్నాడు జీవన్‌రావు.

మేం మా ఆఫీసు ప్రమాదాల షాక్స్‌లో నుండి యింకా తేరుకోక ముందే ఒకనాడు జీవన్‌రావు వచ్చి-

"మా ఆవిడ మంగళగౌరీ వ్రతం చేస్తానంటోందండీ" అన్నాడు.

"గ్రీన్ సిగ్నల్ యిచ్చెయ్యి. అంతకన్నా నువ్వు చెయ్యగలిగిందేమీ లేదు" అన్నాను.

"ఛ. అసలా మాటే చాలా ఫూలిష్‌గా వుంది" అన్నాడు జీవన్‌రావు.

"ఎవరికి? నీకా, ఆవిడకా?"

"ఆవిడ భర్తనైన నాకు"

"అయితే డైవోర్స్ యిచ్చెయ్యి. పాపం శమించుగాక. నా వుద్దేశం అడిగారు"- ఊరికే ఆర్గ్యుమెంటు కోసం అన్నాను.

ఎన్నికల్లో డిపాజిట్టు పోగొట్టుకున్న అభ్యర్థిలాగా దిగులుగా కూర్చున్నాడు జీవన్‌రావు.

"ఇంతకూ మంగళ గౌరీ వ్రతమంటే ఏమిటి? లెఫ్టిస్టును కాకపోయినా నాకీ వ్రతాల సంగతి అంతగా తెలియదు"! అన్నాను.

"ఏముందీ, మొగుడు చిరకాలం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో బ్రతకాలని గౌరమ్మని కొలుస్తారట" అన్నాడు.

"అయితే మరింకేం. నీ కోసమే. ఆవిడ అలాంటి పనులు అవశ్యం చెయ్యాలి. అసలే యిది యాక్సిడెంట్ల సీజన్ లాగుంది. వ్రతం చేస్తే పోయేదేముంది- ఒక రోజు సెలవు తప్ప" అన్నాను.

జీవన్‌రావు పట్టుదల మనిషి. ఆవిడ పాపం సెలవు పెట్టి నిష్ఠగా యింట్లో వుండి వ్రతం ఆచరిస్తుంటే, యితగాడు ఆఫీసుకొచ్చాడు.

"బాడ్ మానర్స్" అన్నాను.

"నో. నా అభిప్రాయాలు నావి." అన్నాడు. ఆ మాటకు తిరుగులేదు కదా!